# మంత్లీ మీల్స్ కూపన్స్

సన్నగా పీలగా వున్న అతను స్వర్గ విలాస్‌లోకి అడుగు పెట్టాడు. ఆ రోజే ఆ హోటల్ ఓపెనింగ్. మైక్‌లోంచి ఘంటసాల పాట వినిపిస్తోంది. ద్వారానికి అటూ ఇటూ అరటి చెట్లు, కొబ్బరి మట్టలు కట్టి వున్నాయి.

కౌంటర్‌లోని కేషియర్‌ని అడిగాడు అతను.

"నెలసరి భోజనానికి టిక్కెట్లు ఇస్తారా ఇక్కడ?"

"తప్పకుండా. ఏ రోజు కారోజు కొంటే అర్ధరూపాయి టిక్కెట్టుకి. నెలకోసారి కొంటే ఆరణాలే అవుతుంది. ముప్పై టిక్కెట్ల పుస్తకం పదకొండు రూపాయల పావలా అవుతుంది." చెప్పాడు కౌంటర్‌లోని వ్యక్తి.

అతను జేబులోంచి పదకొండు రూపాయలు, రెండు బేడలు తీసి ఇచ్చాడు.

"మీ పేరు?" అడిగాడు కేషియర్.

"నిర్మలరావు" చెప్పాడు అతను.

"చదువుకుంటున్నారా?" అడిగాడు కేషియర్ టిక్కెట్ల పుస్తకంలోని ప్రతి టిక్కెట్టు మీద ఆ రోజు తారీకు వేస్తూ.

"అవును. బి. ఏ." చెప్పాడు నిర్మలరావు.

"మీరే మా హోటల్‌లో మొదటగా మంత్లీ మీల్స్ కూపన్స్ కొన్నది. పూటకి ఒక్క టిక్కెట్టే అనుమతిస్తాం, మీరు తిన్నా లేక

ఎవరు తిన్నా అంతకంటే ఎక్కువ వాడితే టిక్కెట్టుకి బేడ ఎక్స్ట్రా ఇవ్వాలి" చెప్పాడు అతను.

"ఇది ఏ సినిమాలో పాట ?" అడిగాడు నిర్మలరావు భోజనం అయాక కేషియర్ ని.

"మంచి మనసులని నాగేశ్వరరావు హీరోగా తీసారు. రేపే విడుదల" చెప్పాడు స్వర్గ విలాస్ కేషియర్.

ఆ టిక్కెట్లు పూర్తయ్యేలోగా నిర్మలరావు అన్నయ్యకి విజయవాడ బదిలీ అవడంతో రెండో మంత్లీ మీల్స్ టిక్కెట్ బుక్ కొనాల్సిన అవసరం లేకపోయింది నిర్మలరావుకి.

ఆఖరి టిక్కెట్టుతో అరిటాకులో భోజనం చేసాక నిర్మలరావు కనకారావుకి చెప్పాడు బయటికి వెళుతూ భోజనం బావుందని, కాని తన అన్నయ్య, వదినలు వచ్చేయడంతో ఇక రానని.

"మళ్ళీ ఎప్పుడయినా అవసరం వస్తే మా హోటల్కి దయ చేయండి" మర్యాదగా ఆహ్వానించాడు కేషియర్.

"మీ పేరు ?" అడిగాడు నిర్మలరావు అతన్ని కేజువల్ గా.

నిర్మలరావుకి కనకారావు తన పేరు చెప్పాడు.

* * *

నిర్మలరావుకి మళ్ళీ హోటల్లో మీల్స్ టిక్కెట్ కొనాల్సిన అవసరం ఎనిమిదేళ్ళ తర్వాత వచ్చింది. స్వర్గ విలాస్కి వెళ్ళాడు.

"ఎంత- మంత్లీ మీల్స్ ?" అడిగాడు.

కనకారావు 'నలభై అయిదు రూపాయలని, పెరుగు తోడయితే అరవై రూపాయి'లని జవాబిచ్చాడు.

"పెరుగులేని భోజనం కూడా వుందా ?" ఆశ్చర్యపోయాడు నిర్మలరావు.

"ధరలు పెరగడంతో ఇలాంటి ఏర్పాట్లు తప్పవు" నవ్వాడు కనకారావు.

"మీ హోటల్ ఓపెనింగ్ దేనాడు మొదటి మీల్స్ టిక్కెట్స్ పుస్తకం కొన్నది నేనే" గుర్తుచేశాడు నిర్మలరావు.

వివరాలడిగి తెలుసుకుని గుర్తు పట్టిన కనకారావుతో చెప్పాడు.

"ఉద్యోగం చేస్తున్నాను. ఇంకా పెళ్ళి కాలేదు. మా అన్నయ్యకి రాంచీకి బదిలీ అయింది."

అతను ఓసారి ఓ అమ్మాయితో వచ్చి భోజనం చేయడం గమనించాడు కనకారావు.

ఆ మీల్స్ టిక్కెట్స్ పూర్తయ్యేలోగానే నిర్మలరావుకి పెళ్ళి ఖాయం అయ్యింది. పెళ్ళి కూడా అయ్యింది. కనకారావుకి కూడా వెడ్డింగ్ కార్డు ఇచ్చి చెప్పాడు నిర్మలరావు.

"ఇంకా నాలుగు టిక్కెట్లు మిగిలి వున్నాయి. మా ఆవిడతో ఎప్పుడన్నా వస్తాను."

కనకారావు గ్రీటింగ్ టెలిగ్రాం పంపించాడు పెళ్ళికి. భార్యతో సాయంత్రం ఆరున్నరకి అత్తగారి వూరి నుంచి వచ్చిన నిర్మలరావు ఆ రాత్రి, మర్నాడు ఉదయం 'స్వర్గ విలాస్'లోని మిగతా నాలుగు టిక్కెట్లని ఖర్చు చేసేసాడు. నిర్మలరావుతో మొదట వచ్చిన అమ్మాయి వేరు, అతని భార్య వేరు అని గ్రహించాడు కనకారావు.

*  *  *

మూడేళ్ళ తర్వాత ఓసారి నిర్మలరావు మళ్ళీ మంత్లీ మీల్స్ టిక్కెట్ల పుస్తకం కొన్నాడు స్వర్గ విలాస్‌లో. పెరుగుతో తొంభై రూపాయలు.

"మా ఆవిడ్ని కానుపుకి పంపించాను. నాలుగు నెలలు ఇక్కడే నా భోజనం" చెప్పాడు నిర్మలరావు.

నిర్మలరావుకి కొడుకు పుట్టి, అతని భార్య తిరిగి వచ్చేదాకా స్వర్గ విలాస్‌లోనే భోజనం చేసాడు నిర్మలరావు.

* * *

పదకొండేళ్ళ తర్వాత మళ్ళీ నిర్మలరావు స్వర్గ విలాస్‌కి వచ్చి మంత్లీ మీల్స్ కూపన్స్ కొన్నాడు.

"ఫుల్‌మీలా లేక ప్లేట్‌మీలా ?" అడిగాడు కనకారావు.

"అంటే ?" తేడా తెలీని నిర్మలరావు అడిగాడు.

"ఫుల్‌మీల్ అంటే మామూలు భోజనం. ఎన్నిసార్లయినా వడ్డిస్తారు. నెలకి నూటఏభై. ప్లేట్ మీల్ అయితే అన్నం, కూరలు లిమిటెడ్‌గా ఇస్తారు. అది తొంభై రూపాయలు. అన్నం ఇంకా కావాలంటే ఎక్స్‌ట్రా అవుతుంది."

"ప్లేట్ మీల్స్ ఇవ్వండి. చూస్తాను."

"మీరు నిర్మలరావు కదూ ?" అడిగాడు కనకారావు.

"అవును లావయినా గుర్తు పట్టారే."

"మీ ఆవిడ పుట్టింటి కెళ్ళిందా ?" అడిగాడు కనకారావు టిక్కెట్ల మీద డేట్‌స్టాంప్ కొడుతూ.

"ఊహూ, మా ఆవిడతో పోట్లాడాను. ఇంట్లో అన్నం తినడం మానేసాను, అని చెప్పలేక "అవును అని అబద్ధం చెప్పాడు నిర్మలరావు.

"పన్నెండో టిక్కెట్ వాడాక వాళ్ళిద్దరి మధ్య సయోధ్య కుదిరింది. హోటల్ భోజనం మానేయమన్నది అతని భార్య. తొందరపడి మీల్స్ టిక్కెట్లు కొన్నందుకు కోప్పడింది.

"మా ఆవిడ వచ్చేసింది. పుస్తకం తీసేసుకుంటారా" అడిగాడు నిర్మలరావు మొహమాట పడుతూనే.

"భలే వారే! మా హోటల్‌లో మొదటి మంత్లీ మీల్స్ టిక్కెట్ కొన్నది మీరే కదా. వేల్యూడ్ కస్టమర్ మీరు" అని కనకారావు లెక్కలు

వేసి, మిగిలిన డబ్బు వాపసు ఇచ్చాడు. తనని మొదటి కస్టమర్‌గా గుర్తుంచుకున్నందుకు నిర్మలరావు ఆనందపడ్డాడు కూడా.

*  *  *

దాదాపు పధ్నాలుగేళ్ళ తర్వాత నిర్మలరావు, స్వర్గ విలాస్‌కి మళ్ళీ వచ్చాడు. మంత్లీమీల్స్ కూపన్ గురించి వాకబు చేసాడు.

"ఫుల్ మీల్ అయితే ఎంత? ప్లేట్ మీల్ అయితే ఎంత?"

"ఫుల్ మీల్ పద్ధతి ఇప్పుడు లేదు. ప్లేట్ మీల్‌కి రెండు వందల పది రూపాయలు. రోజూ కొంటే ఎనిమిదిన్నర రూపాయలు .... మీరు నిర్మలరావు కదా?" అడిగాడు కనకారావు.

"అవును గుర్తు పట్టారనుకున్నాను" చెప్పాడు నిర్మలరావు చిన్నగా నవ్వి.

"భలేవారే! జుట్టు పోయి ఇంకాస్త లావయినంత మాత్రాన మర్చి పోతాననుకున్నారా? మీ ఆవిడ, మీ పిల్లల దగ్గరకి వెళ్ళిందా?" అడిగాడు కనకారావు."

"అవునండి పెద్ద కోడలికి పురుడు రోజులు. కన్నాక కాని రాదు. ఈ నాలుగు నెలలూ నా భోజనం ఇక్కడే."

"అదేమిటి? తొలి చూలుకు పుట్టింటికి వెళ్ళదా మీ కోడలు?" అడిగాడు కనకారావు.

"ఏం చెప్పమంటారు? ప్రేమవివాహం. కడుపొచ్చిందని తెలిసాక జరిగిన పెళ్ళి. వాళ్ళ వాళ్ళు ఇంతదాకా తిరిగి చూడలేదంటే నమ్మండి?

"ఏవిటో ఈ కాలం పిల్లలు" సానుభూతిగా చెప్పాడు కనకారావు.

"నేనూ ప్రేమించాను. కాని మా అమ్మా నాన్నల మాటలకి ఆ రోజుల్లో ఎదురు చెప్పలేకపోయాను. కాలం మారింది" ఒప్పుకున్నాడు నిర్మలరావు.

కనకారావుకి చూచాయగా గుర్తొచ్చింది నిర్మలరావు పెళ్ళికి

ముందు ఓ అమ్మాయితో హోటల్‌కి వచ్చి భోంచెయ్యడం. ఆరేళ్ళ తర్వాత ఓసారి మనవడితో వచ్చాడు నిర్మలరావు. కేవలం ఆ హోటల్ భోజనం తన మనవడికి పెట్టించాలనే. కనకారావు కొడుకు కేషియర్ స్థానంలో కూర్చుని వున్నాడు. కనకారావు లాడ్జింగ్ సెక్షన్‌లో అజా మాయిషీ చేయడానికి వెళ్ళాడని చెప్పాడు అతని కొడుకు. కనకారావు గురించి అడిగితే నిర్మలరావు పేరు వినగానే పరిగెత్తుకొచ్చాడు కనకా రావు. నిర్మలరావు మనవణ్ణి ఎత్తుకుని ముద్దాడాడు.

వాళ్ళ దగ్గర డబ్బు తీసుకోకుండా మీల్స్ టోకెన్ ఇచ్చాడు.

"ఇదేమిటి ? డబ్బు తీసుకోరేం ?" అని నిర్మలరావు అడిగితే చాల్చాల్లెండి. ఊరుకోండి. మీ దగ్గర డబ్బు తీసుకుంటానా ? మీ హస్త వాసి వల్లే కదా హోటల్ ఈ స్థాయికి వచ్చి లాడ్జింగ్ కూడా పెట్టగలి గింది" కోప్పడ్డాడు కనకారావు.

నిర్మలరావుకి కనకారావు ఆదరింపు ఎంతో సంతోషాన్నిచ్చింది.

* * *

మరో నాలుగేళ్ళ తర్వాత నిర్మలరావు స్వర్గ విలాస్ ముందు నిల బడి లోపలకి వెళ్ళాలా, వద్దా అని కొద్దిసేపు ఆలోచించాడు. కాని తనకి అలవాటయిన ఆ హోటల్‌కి తప్ప ఇంకో హోటల్‌కి వెళ్ళబుద్ధి కాలేదు.

లోపలికి వెళ్ళి కౌంటర్‌లోని కనకారావు కొడుకుని అడిగాడు.

"మంత్లీ మీల్స్ కూపన్స్ ఎంతండి ?"

ఎంతయినా ఒకటే అన్న ధోరణిలో జేబులోంచి రెండు వందల రూపాయల నోట్లు తీసిస్తే వాటిని తీసుకుని ముప్పైరూపాయలు, కూపన్స్ పుస్తకం తిరిగి ఇచ్చాడతను.

"కనకారావు గారేరి ?" అడిగాడు.

"లేరండి, మీకు నాన్నగారు తెలుసా ?"

"తెలుసు బాబూ. నా పేరు నిర్మలరావని...."

"మీరా సార్? మా హోటల్‌లో మొట్టమొదటగా మీల్స్ టిక్కెట్టు కొన్నది మీరే అని నాన్నగారు చెప్తుండేవారు."

"చెప్తుండేవారా? అంటే?"

కనకారావు ఫోటోని, దానికి వేసిన గంధం చెక్కతో చేసిన పూల దండని చూపించి చెప్పాడు కనకారావు కొడుకు.

"పోయారండి."

"హరి భగవంతుడా? ఎప్పుడు?"

"రెణ్ణెల్లయిందడి."

"అరె పాపం."

"ఈ వయసులో మీరు మంత్లీ కూపన్స్ కొంటున్నారేమిటండి?" అడిగాడు కనకారావు కొడుకు నవ్వుతూ.

"అంతా మీ నాన్నగారంత అదృష్టవంతులు కారు బాబూ! మా ఆవిడపోయి ఇవాల్టికి ఇరవై రెండో రోజు. మనిషి మంత్లీ మీల్స్ కూపన్స్ కొనే అన్ని దశలా చవిచూసాను. ఇది ఆఖరి దశ. భగవంతుడు ఈ దశ లేకుండా చేస్తాడనుకున్నాను. కాని ఇలా అయింది" చెప్పాడు నిర్మలరావు. దిగులుగా నవ్వి.

"అరెరె. అయాం సో సారి అండి. మరి మీకో అబ్బాయి, అమ్మాయి వున్నారని నాన్నగారు చెప్పేవారు?" అడిగాడు కనకారావు కొడుకు.

"ఒకరు అమెరికాలో, ఇంకొకరు కెనడాలో సెటిల్ అయారు."

వెనక్కి తిరిగిన నిర్మలరావుని అడిగాడు కనకారావు కొడుకు.

"భోంచెయ్యకుండా వెళ్ళిపోతున్నారే?"

"మీ నాన్నగారి ఫోటోకున్న పూలదండ చూసాక ఎందుకో ఆకలి చచ్చిపోయింది బాబు! తక్కువే అయినా నలభై ఏళ్ళపైబడ్డ అను బంధం మాది" చెప్పాడు నిర్మలరావు.

[ రచన సచిత్ర మాసపత్రిక 1992 ]